కథా నిలయం
శ్రీకాకుళం

# ఓ జానకి కథ

జానకి ముఖం ఎర్రబడి వింతగా కనిపిస్తోంది. ముంగురులు నుదిటి మీద నాట్యం చేస్తున్నట్టుగా ఎగురుతున్నాయి. చందమామలా ధగధగా మెరుస్తున్న ఎర్రటి కుంకుమబొట్టు ఆమె ముఖానికి వింత శోభనిచ్చింది. వెయ్యి కాండిల్ బల్బులా వెలిగిపోతున్న ముఖాన్ని సిగ్గుతో కిందికి వాల్చింది జానకి.

"అచ్చు జమునలా ఉన్నావే" అంది అనసూయ.

"ఎంత అందంగా ఉందో బొట్టుపెట్టుకుంటే" ప్రమీలఅంది.

"అమ్మా... సాక్షాత్తూ సీతాదేవిలా ఉన్నావమ్మా...నీ మొహంలో ఎంత కళొచ్చిందో చెప్పలేను. ఈ బొట్టు ఇలాగే ఉంచుకోమ్మా'' ఆశీర్వదించారు గోపాలరావుగారు.

భయంతో జానకి గుండెలు దడదడ కొట్టుకున్నాయి. నరనరంలోనూ వణుకుపుట్టుకొచ్చింది. ఆనాడు... ఆరాత్రి... తలచుకుంటే

గుండె బద్దలయిపోతున్నట్టనిపించి, మరి నుంచోలేక పక్కనున్న సోఫాలో కూర్చుని తల మోకాళ్ళమీద ఆనించి వెక్కి వెక్కి ఏడవసాగింది.

అనసూయ, ప్రమీల, కాంతమ్మగారూ కంగారుపడిపోతున్నారు జానకిని ఎలా ఊరుకోబెట్టాలో తెలీక.

బొట్టు చెరిపేసుకోబోయింది జానకి. చెయ్యి పట్టుకుని ఆపుచేశారు గోపాలరావుగారు. అతని వొళ్ళో తలపెట్టుకుని పసిపిల్లలా బావురుమంది జానకి.

ఆరోజు రాత్రి సంఘటన మళ్ళీ గుర్తుకొచ్చింది. ఆరోజు చెల్లెలు లలిత పుట్టినదినం. అన్నయ్య కొత్తబట్టలు కుట్టించాడు. బజారుకెళ్ళి చేతి నిండా గాజులేయించుకుని, కొత్త రిబ్బన్లూ, ప్రక్క పిన్నీసులూ ఎర్రటి తిలకం సీసా, కనకాంబరాల దండా కొనుక్కొచ్చింది లలిత. వనజా, గిరిజా కూడా గబగబా ముస్తాబయ్యారు. లలిత తెచ్చిన పూలు పెట్టుకుంటూ ఉంటే తనకి ఎంతో ముచ్చటేసింది. "అమ్మా .. నాకు పూలు—" అమ్మ వినిపించుకోనట్టుగా అక్కడినుంచి వెళ్ళిపోయింది. ఆమె ఎప్పుడూ అంతే. తను పూలూ, బొట్టూ, గాజులూ వీటిసంగతి ఎత్తినప్పుడల్లా మాట్లాడకుండా అలా వెళ్ళిపోతుంది. అమ్మకి నేనంటే ఇష్టంలేదేమో" అనుకునేది అలా అనుకోగానే ఏదో బాధ కడుపులో ఉండ చుట్టినట్టుగా అయ్యేది. చెల్లాయిలందరూ స్నేహితులతో కలసి ఆడుకుంటున్నారు. గబగబా గదిలోకెళ్ళి చెల్లాయి డబ్బాలోంచి తీసి గాజులు చేతి నిండా తొడుక్కుంది. దేముడి ఫోటోకేసున్న పూలదండతీసి తల్లో పెట్టుకుంది. తిలకం సీసా తీసుకుని ఎర్రగా పెద్ద బొట్టు గుండ్రంగా పెట్టుకుని అద్దం ముందు కూర్చుని, తన మొహాన్ని చూసి తనే ఆశ్చర్యపోతూ

మురిసిపోయింది. ఈ బొట్టు ఎంతో అందంగా అనిపించింది. అలా ఎన్ని గంటలు కూర్చుందో అద్దంముందు, చెంప ఛెళ్ మనేసరికి షాక్ కొట్టిన దానిలా తిరిగి చూసింది. అన్నయ్య కోపంతో వణికిపోతున్నాడు "ఎవర యినా చూస్తే ఏమనుకుంటారు? మనం నేర్పిస్తున్నామని అనుకుంటారు. దీన్ని స్కూలు మాన్పించి ఇంట్లో కూర్చోబెడితే సరి" అమ్మమీద అరచు కుంటూ వెళ్ళిపోయాడు అవతలికి అన్నయ్య. ఏడుస్తూ. అన్నయ్య వెళ్లిన వైపే చూస్తుండిపోయింది తను. తలుపుదగ్గర ఎవరో ఏడుస్తున్నట్టుగా ఎక్కిళ్ళు వినబడ్డాయి, తిరిగి చూసింది అమ్మ. నోటికి చీరకొంగు అడ్డు పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. అమ్మ అలా ఏడుస్తుంటే ఎలాగో అయిపోయింది తనకి. అమ్మా ఇంకెప్పుడూ బొట్టు పెట్టుకోను నువ్వేడవకు" అంది. తను అమ్మని వోదార్చాలన్న ప్రయత్నంలో తనూఏడుస్తూ. అమ్మ తనని గట్టిగా కౌగిలించుకుని, మరీమరీ ఏడ్చింది. నీకా అదృష్టం లేదమ్మా చిన్నతనంలోనే నీజీవితం తెల్లారిపోయింది. నాన్నపోయాకనాకూబతుకంటే ఏమిటో తెలీకుండానే నీకూ ఒకేగతి పట్టిందమ్మా" అమ్మ బోరుమని ఏడ్చింది.

"అమ్మా— ఇంకెప్పుడూ నేనీపని చెయ్యను. అన్నయ్యతో నన్ను స్కూలు మానిపించవద్దని చెప్పమ్మా" అంది తను.

"అలాగే తల్లీ! ఆ సరదా అయినా నీకు తీరనీయమ్మా. నీ యిష్టం వచ్చినంతవరకూ చదువుకో, అన్నయ్య ఏమీ అనడు: అని లాలించింది అమ్మ. ఆ లాలనలో ఏం మహత్యం వుందో హాయిగా నిట్టూర్చింది. తను అంతే— అదిజరిగి దాదాపు అయిదారేళ్ళుకావస్తోంది. ఇంతవరకు ఒక్క

సారికూడా తను బొట్టుగురించి గాని, పూల గురించి కానీ ఆలోచించలేదు. స్కూల్ ఫైనల్ కాగానే అన్నయ్య చదువు మానిపిస్తానన్నాడు.

"పోనీ లేరా దాన్ని చదువుకోనీ" అంది అమ్మ.

"చదివేం చెయ్యాలేం? ఉద్యోగం చెయ్యాలా?" అన్నాడు.

"చదువుకోకుండా ఇంట్లో కూర్చొని మాత్రం ఏం చేస్తుంది. ఇంట్లో చాకిరి చెయ్యాలా?" అంది అమ్మ.

అన్నయ్యేమనుకున్నాడో మరి మాట్లాడలేదు. తనకి కాలేజీలో సీటుతోపాటు స్కాలర్ షిప్పుకూడావచ్చింది మెరిట్ లో పాసయినందుకు. తన చదువుబాధ్యత అన్నయ్యకి ఏమాత్రం లేకపోవడం వల్లనేమో, మరి ఇంక తన చదువు సంగతి ఎత్త లేదు. బి.ఏ.లో చేరాక కూడా స్కాలర్ షిప్పు వచ్చింది. చదువు తప్ప మరే ధ్యాసా మనస్సుకి పట్టించుకుండా జాగ్రత్త పడుతూ వచ్చింది తను. కానీ, ఈ రోజునే...

ఇక్కడ జరిగిందేమిటి? అరుంధతి తనస్నేహితురాలు. తన పుట్టిన రోజు పార్టీకి తప్పకుండారావాలని పట్టుబట్టింది. ఎంతరానన్నా వదిలి పెట్టకపోవడం వల్ల రాక తప్పలేదు తనకి. అరుంధతి నాన్నగారు గొప్ప సోషల్ వర్కర్. ఉద్రేకంలో అరుంధతిచేతి మొహాన బొట్టు పెట్టించాకే కాని, అన్నయ్యేమంటాడు? తను అమ్మకి ఇచ్చిన మాటేమిటి! దుఃఖంతో ఆలోచించలేక పోతోంది. ఒడిలో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఎందుకమ్మా అలా వణికిపోతున్నావ్? మీ అమ్మగారితో నేను చెబుతాను" అన్నారు గోపాలరావు.

వారి బలవంతంమీద బొట్టు ఉంచుకోక తప్పలేదు. పార్టీ అయ్యాక గోపాలరావుగారూ, అరుంధతీ స్వయంగా బయలుదేరారు, జానకిని దింప డానికి.

ఓక్కు-బిక్కు- మంటూ ఇంటిలో అడుగు పెట్టింది. జానకి. కూతురు కేసి ఆశ్చర్యంగా చూసింది తల్లి వెంకటలక్ష్మి. సమయానికి అన్న రంగా రావు ఇంటిలోనే ఉన్నాడు. చెల్లెలివంకా, గోపాలరావుగారివంకా అదోలా చూశాడు.

"బాబూ, రంగారావ్! ఇందులో జానకి తప్పేమీ లేదు. ఈ పని చేసింది నేనే" అన్నారు మర్యాదగా గోపాలరావుగారు.

"అలా చెయ్యడంలో మీ ఉద్దేశ్యం?" కటువుగా ఉంది అన్నయ్య గొంతు.

"ముక్కు-పచ్చలారని పసిపిల్లని ముసలిదానిలా మూల కూర్చో బెట్టడం ఇష్టంలేక."

"ఎవరి ఖర్మకి ఎవరు కర్తలు? దాని అదృష్టం అంతే — ఎవరేం చేస్తారు?"

"వాడిపోయిన చెట్టుకు నీరుపోస్తే, తిరిగి కొత్త చిగుళ్ళేస్తాయి. పూలు పూస్తుంది. కాయలు కాస్తుంది. లేకపోతే, వాడి ఎండి నశిస్తుంది"

"ఇదీ...జీవితం..."

"కనుకనే చెబుతున్నాను. ఒకనిండు జీవితాన్ని చేతులారా నాశనం చెయ్యొద్దని."

"గోపాలరావుగారూ...ఇది మా స్వవిషయం. మా కుటుంబ వ్యవహారాలలో మీరు అనవసరంగా జోక్యం చేసుకోకండి. ఏదో వరువుగా బతుకుతున్నాం. లేనిపోని ఆశలు కల్పించి దాని బుర్ర పాడు చెయ్యకండి మా మానాన్న మమ్మల్ని వదిలెయ్యండి. మా సాంప్రదాయాలు వేరు, మా పద్ధతులు వేరు. ఈ సంస్కరణలు మమ్మల్ని మార్చలేవు." ఆవేశంతో చెబుతున్నాడు రంగారావు.

"చూడు, రంగారావ్! సాంప్రదాయాల పేరిట జీవితాలని బలి చెయ్యడం అన్యాయం. జానకి చక్కనిదీ, చురుకైనది. పెళ్ళంటేఏమిటో సర్గ్గా తెలసీ తెలియని వయస్సులోనే పెళ్ళిజరగడం, వైధవ్యం రావడం జరిగిపోయింది! తీరా జ్ఞానం వచ్చి జీవితంమీద ఆశలుపుట్టే సమయానికి సాంప్రదాయమంటూ, పద్ధతంటూ ఆమెని బందీ చేస్తున్నారు,"

"అలా అని అది మీతో చెప్పిందా?" కళ్ళెర్రజేసి జానకి వంక చూశాడు రంగారావ్.

జానకి బెదురుగా అక్కడనుంచి వెళ్ళిపోయింది.

"ఏ ఆడపిల్లా నోరు విడిచి అలా అని ఎవరితోనూ చెప్పుకోదు. అందులోనూ జానకిలాంటి సుగుణవతి! రంగారావ్! నీకు ఆవేశమేగాని ఆలోచనలేదయ్యా మీరందరూ ఎవరికి వారయ్యాక జానకి గతి ఏమవుతుందనుకున్నావ్?" ఈసారి గోపాలరావుగారి గొంతు ఆవేశంతో ఆకాశాన్నందుకుంది.

రంగారావు గొంతు దుఃఖంతో పూడుకుపోయింది, కళ్ళు చెమ్మగిల్లాయి "మా జానకికోసం నేను ఏ త్యాగమైనా చేస్తాను అవసరమైతే

పెళ్ళి చేసుకోవడం మానేస్తానండీ. జీవితాంతం మా అమ్మతోపాటు ఆమెనీ చూసుకుంటాను. అంతేకానీ, మా కుటుంబానికి మచ్చతెచ్చే సంస్కరణలు చెయ్యను. మీకు నమస్కారం పెడతాను దయచేసి మరోసారి ఇటువంటి పని చెయ్యకండి" మరి మాట్లాడలేక కళ్ళు వొత్తుకున్నాడు.

లోపలినుంచి అన్నయ్య మాటలు విన్న జానకి అతనికి తనమీద గల అభిమానానికీ, అతని ఆత్మాభిమానానికి కూడా ఆశ్చర్యపోయింది. తన కోసం ఆత్మత్యాగం చేస్తానన్న అన్నయ్యని దేముడిలా కొలవాలనుకుంది. అతని మనసు బాధ పడేపని ఏ రోజూ, చెయ్యకూడదనుకుంది. అంతే తృప్తిగా నవ్వుకొని, నుదుట నున్న కుంకుమబొట్టు చెరిపేసుకుంది.

గోపాలరావుకూడా కాసేపు కూర్చుని మరింకేం మాట్లాడకుండా వెళ్ళిపోయారు. ఆరోజునుంచీ జానకి, అరుంధతీవాళ్ళింటికి వెళ్ళడం మానేసింది. కాలేజీ, ఇల్లూ, అమ్మా, అన్నయ్య ఇదే తన ప్రపంచంగా భావించుకుంది.

○ ○ ○ ○ ○ ○

చదువు పూర్తవకుండానే లలితకు పెళ్ళి కుదిరింది. జానికి బి ఏ. పూర్తిచేసింది. లలితని పెళ్ళికూతురుగా చూస్తూ జానకి ముచ్చటపడిపోయింది. ఆనందంతో పరవశించిపోయింది. లలిత భర్తతోకలిసి అత్తవారింటికి వెళ్ళిపోతూవుంటే, ఆనందంతోనూ బాధతోనూ వలవలా ఏడ్చింది.

లలిత వెళ్ళిపోయాక ఏదో కొరతా, ఏదో లోటూ ఫీల్ అవసాగింది. ఎమ్.ఏ. చదువుతానంటే అన్నయ్య వద్దన్నాడు. తనూ పట్టుపట్టలేదు. అమ్మకి ఇంటిపనుల్లో సాయపడుతూ వుండిపోయింది. మరో రెండేళ్ళు

గడిచిపోయాయి. లలితకి కొడుకు పుట్టాడు. తీరికలేదంటూ తరచూ ఉత్తరాలుకూడా రాయడంలేదు లలిత. వనజ, గిరిజలకిఒక్కసారే సంబంధాలు కుదిరాయి.

రంగారావు మాత్రం ఎన్ని సంబంధాలొచ్చినా వద్దంటున్నాడు.

వనజ, గిరిజల పెళ్ళిళ్ళుకూడా జరిగిపోయాయి తల్లీతనుమిగిలారు, ఈ మధ్యన రంగారావుకి కాంపు లెక్కువయ్యాయి. ఆ పోస్టలాంటిది, వెళ్ళక తప్పడం లేదు. ఒక శుభ మహూర్తాన అసిస్టెంట్ ఇంజనీర్ రంగారావుని, తన బాస్ కూతురు రాణి ఎక్కడో చూసి, అప్పుడే ప్రేమించానంటూ తండ్రి చేత రాయబారం పెట్టింది. రంగారావు మనసు కాదనక బాస్ ఆర్డర్స్ కాదనలేక పోయాడు, రాణి పేరు ఉట్టి రాణీయే కాని, పెరగడం మహారాణిలా పెరగడంవల్ల, రంగారావే ఇల్లరికం వెళ్ళాల్సొచ్చింది. జానకికీ, తల్లికీ క్షమాపణ చెబుతూ అత్తగారింటికెళ్ళాడు రంగారావు.

వెంకటలక్ష్మి గొంతు మూగబోయింది. జానకికి పిచ్చెక్కినట్టయింది అన్నయ్య వదిన తన కళ్ళముందున్నా బాగుండేవి. వారినీడలో నిద్రపోయే వాళ్ళం. ఇప్పుడు పూర్తిగా తోడులేని జీవితాలయిపోయాయి. అంటూ ఏడ్చేది, చదువుకున్నందుకు మెల్లగా ఒకస్కూల్లో ఉద్యోగం సంపాదించుకుంది. ఖర్చులకోసం అంటూ అన్నయ్యకొంత పంపిస్తున్నాడు. తింటున్నారు, తిరుగుతున్నారు. జీవితం యాంత్రికంగా సాగిపోతోంది. రాత్రీ పగలు, పగలూ రాత్రీ మార్పులేనిరోజులు చూసి చూసి విసిగిపోతుంది. తల్లికిప్పుడు తనేతోడు మరి తనకెవ్వరు తోడు? లలిత, వనజా, గిరిజా ఎవరి సంసారం గొడవల్లో వాళ్ళున్నారు అన్నయ్య ఇల్లరికపు సామ్రాజ్యాన్నేలు తున్నాడు.

"సడన్‌గా అమ్మపోతే..." అంధకారం గుండెల్లో నిండిపోయింది. నైరాశ్యం కళ్ళల్లో చోటు చేసుకుంది ఆవేదన నరనరాన్నీ పిండేస్తోంది ఆడదానిగా పుట్టినందుకు మొదటిసారిగా తన్ను తాను తిట్టుకుంది. సంఘం, కట్టుబాట్లు, సంప్రదాయాలూ అన్నీ ఆడదానిపాలిట శాపాలుగా కనిపించాయి. భార్య పోతే భర్త మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు పిల్లల్ని కంటాడు. ఆ ఆనందంలో మొదటిభార్యను క్రమేణా మరిచిపోతాడు. ఆ పని ఆడది చేస్తే తప్పు-పాపం-నరకానికిపోతుంది.

'మగవాడు బ్రహ్మచారిగా ఉన్నా సంతోషంగా బతగ్గలడు. ఎటు తిరిగినా, ఏం చేసినా, సమాజం అతన్ని క్షమిస్తుంది. తోడుకోసం అతను పెళ్ళి చేసుకోనక్కరలేదు. కానీ ఆడదానికి ఆ హక్కేది? తన కన్నా చిన్నవాడితో మాట్లాడినా రంకుకడుతుంది సంఘం. ఒంటరిగా బతకనివ్వదు. మగవారికి అలుసు, ఆడవారికి అసూయ. ఈ రెంటికీ మధ్య ఒంటరిగా బతికే ఆడది బలైపోతుంది.' ఆనాడు గోపాలరావుగారన్న మాటలు చెవుల్లో ఖంగుమన్నాయి. కళ్ళుతుడుచుకుంది ధైర్యాన్ని తెచ్చుకుంది. ఏదో నిర్ణయానికొచ్చినదానిలా తృప్తిగా నిట్టూర్చింది.

మిసెస్ జానకిజార్జ్ పంపిన వాళ్ళ వివాహపు విందు పత్రిక నిమాసి పళ్ళు పటపటా కొరికాడు రంగారావ్. హేళనగా నవ్వింది రాణి. తల బాదుకుంది వెంకటలక్ష్మి. లలితా, వనజా, గిరిజా వెక్కిరించారు, ఇరుగూ పొరుగూ నానా రకాలుగా నవ్వారు. అయితేనేం జార్జ్ కమ్మని తలపులతో, అతని ప్రేమ చిహ్నాలు ప్రకాష్, దాస్, మేరి, 'అమ్మా' అన్న పిలుపులతో ఈ లోకాన్ని మరచి పోతూంది జానకి. సంఘం సంప్రదాయం, కులం,

మతం ఇవేవీ ఆమెను బాధించవు. తన ఇల్లూ, తన పిల్లలూ తన భర్తా అవే తనలోకం. అంతే. అప్పుడప్పుడు గోపాలరావుగారు జ్ఞాపకంవస్తారు పితృవాత్సల్యంతో మనస్ఫూర్తిగా అతనికి మనస్సులోనే నమస్కరిస్తుంది. తనని చూడని సమాజం తనకక్కర్లేనట్టుంది.

ఇదీ జానకి కథ అంటూ అనసూయ రాసిన ఉత్తరం చూసి తృప్తిగా నిట్టూర్చింది అరుంధతి. జానకి జీవితంలో స్థిరపడినందుకు మూల కారకుడైన తన తండ్రికి మనస్సులోనే జోహారులర్పించుకుంది కానీ "జానకిని అర్థం చేసుకోలేని సంఘం మూఢ నమ్మకాల సంకెళ్ళలో పడి, నలిగిపోతున్న కుటుంబాలూ, సాంప్రదాయపు ఉచ్చులోపడి, వెలుగు చూడని జీవితాలూ మారేదెప్పుడో" అని నిట్టూరుస్తూ ఉత్తరాన్ని మడిచి బీరువాలో పెట్టి పనిలో నిమగ్నురాయింది అరుంధతి.